

చిరుగాలికి ఎగురుతూ నాట్యం చేస్తున్నాయి మాధవి నుదుటిమీది ముంగురులు. కిటికీ ఊచల సందుల్లోనుంచి కనపడుతున్న మల్లెపందిరిని తదేకంగా చూస్తున్నాయి ఆమె నయనాలు. పచ్చని ఆకులచాటు నించి తొంగిచూస్తూ, గర్వంగా నవ్వుతున్న ఆ మల్లెమొగ్గలను చూస్తుంటే, ఆమెలో ఏవో ఆలోచనలు కదలసాగాయి.

'సిగలో' అలంకరించుకునేవాళ్ళు లేక, పందిరిమీదే ఉండిపోయిన ఆ మల్లెమొగ్గల లాంటిదే తన జీవితం. ఒక్క రాత్రి మాత్రమే వాటి బ్రతుకు. ఈ ఒక్క రాత్రి మాత్రమే వాటి పరిమళాలు. రేపు వాడి ఎల్లుండి రాలిపోతాయి ఆ పువ్వులు.

'మల్లె అయినా, మగువ అయినా, వెన్నెల అయినా అనుభవించితేనే అందం. ఆ అందంలోనే ఉంటుంది ఆనందం. ఆ మాత్రం తెలియదా, తన భర్తకి?



## పుష్పము మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ సరియైన పర్యను గురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామానూ, వెంటనే వ్రాసి పంపండి. జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోనూ మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము ఏ వ్యవహారములో మీకు జయము కలుగునో ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీ సుఖము, సంతానము, విధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగు వానిని గురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-25 పైసలకుమాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవైనా ఉన్నయెడల శాంతిచేయు విధానము కూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా లేనిఎడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించండి. అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

**PT. DEV DUTT SHASTRI, RAJ JYOTSHI (A.P.W.)**
**POST BOX NO. 86, JULLUNDUR CITY.**



## కొద్దిపాటి రు. 5/- ల పెట్టుబడికి మీకు హెచ్చు విలువ గల ఈ దిగువ తెల్పిన వస్తువులలో ఒకటి లభిస్తుంది.

## ఎవర్ సిల్వర్ వస్తువులు

| | | | |
|---|---|---|---|
| 1. టిఫిన్ కారియర్ | 1 | 11 బిందె | 1 |
| 2. వడ్డన గిన్నెల చట్టి | 1 | 12. దీపపు స్తంభం | 1 |
| 3 సాంబార్ బొక్కెన | 1 | 13 టెరిలిన్ షర్టు (28" నుంచి 40" సైజు) | 1 |
| 4. కూజా | 1 | 14. సూట్ కేసు | 1 |
| 5. భోజనపు పళ్లెములు | 3 | 15. షర్టింగ్ గుడ్డ (మేలురకం) | 4 |
| 6. దబర టంబ్లర్లు | 4 | 16. నైలెక్స్ చీర | 1 |
| 7. సాదా టంబ్లర్లు | 8 | 17 టెరీకాటన్ చీర | 1 |
| 8. దొంతర సెట్టు (నాలుగు గిన్నెలది) | 1 | 18. ఎలెక్ట్రిక్ ఇస్త్రీపెట్టె | 1 |
| 9 కప్పు, సాసర్ | 5 | 19 టైంపీస్ | 1 |
| 10 ఇడ్లీ పళ్లెం | 1 | 20 అన్నపు వడ్డన గిన్నె | 1 |

*వివరములకు మాకు వ్రాయండి. ఏజంట్లు కూడ వ్రాయవచ్చును.*

**Sri SRINIVASA SALES CIRCULATION (Regd.)**
No. 45, Devar Street, Villivakkam, MADRAS-49.


# వల

తెలుసు. తెలుసుకునే మనస్సు ఆయనకు ఉంది. చిత్రకారుడుగా అతని కెంతో పేరుంది. అతని చిత్రాలన్నీ మనుషులతో మనసు విప్పి మాట్లాడుతున్నట్లే ఉంటాయి. ఆతడు తన కుంచెద్వారా చిత్రాలకు జీవాన్ని పోస్తాడు.'

భర్త గుర్తుకు రాగానే, మాధవికి గతం అంతా కళ్లముందు నిలిచినట్లయింది. నయనాలు మల్లెలను చూస్తున్నా, మనోనేత్రం గతాన్ని అవలోకిస్తున్నది.

• • •

తొలి రేయిని గురించి కలలు కంటున్న కళ్ళు, సిగ్గుతో బరువుగా వాలిపోతూంటే, భర్తను తనివితీరా చూడాలని, అతి ప్రయత్నంమీద వాలిపోతున్న కళ్లను పైకెత్తి, చూపరుల దృష్టిని ఇట్టే తనవైపు తిప్పుకోగల రవిని చూస్తూ తలుపు దగ్గిరే ఆగిపోయింది మాధవి.

"మధూ!" ఆమెను సమీపిస్తూ పిలిచాడు రవి.

అతడు తొలిసారిగా పిలిచిన పిలుపుతో ఆమె శరీరంలోని ప్రతి అణువూ అంతులేని ఆనందంతో నిండిపోయింది. ఆ క్షణంలో ఆ గది ఒక పూలతోటగా కనిపించింది ఆమె కళ్లకు.

"మధూ!" మళ్లీ పిలిచాడు రవి.

పూలతోటలో విహరిస్తున్న మాధవి ఉలిక్కిపడింది. బెదరుతూ, అతని వంక చూసి "ఊఁ" అంటూ తల వంచుకుంది.

"ఎందుకంత సిగ్గు?" కుడిచేతి చూపుడు వేలుతో ఆమె గడ్డాన్ని పట్టి, ముఖాన్ని పైకి ఎత్తి, విశాలమైన ఆమె నయనాలలో తన రూపాన్ని చూసుకున్నాడు రవి. సిగ్గుతో ఆమె బుగ్గలు ఎరుపెక్కాయి. అది గమనించిన రవిలోని చిత్రకారుడు మేలుకున్నాడు.

"ఎంత అందంగా ఉన్నావు మధూ! పాల నురుగు లాంటిది ఈ తెల్లటి చీర. నీ ముంజేతిని ముద్దాడుతున్న ఈ బంగారపు గాజులకన్నా పచ్చటి ఛాయతో మెరుస్తున్నది నీ శరీరం. నుదుటిమీద చిలిపిగా అల్లరి చేస్తూ, నాట్యం చేస్తున్న ఈ ముంగురుల చాటున, మబ్బుల పరదాల చాటున చందమామలా ఈ కుంకుమ బొట్టు వెలుగుతున్నది. తీర్చి దిద్దినట్లున్నవి ఈ కనుబొమ్మలు. సృష్టిలోని అందాన్ని అంతా తమ స్వంతం చేసుకున్నవి ఈ మీనాల్లాంటి నయనాలు. ఈ పొడవైన నాసికతో, అరుణకాంతితో మిడిసిపడుతున్న ఈ అధరంతో అద్దాల్లాంటి చెక్కిళ్లతో దివినుండి భువికి నాకోసం దిగివచ్చిన దేవకన్యలా ఉన్నావు."

అతని మాటలకు మాధవి పెదవులపై చిరునవ్వు మెరిసింది: మెల్లిగా అంది! "మరీ పొగిడేస్తున్నారే! కొంపతీసి రచయితగా మారిపోరు కదా, చిత్రకారుడల్లా."

"నీవు నా సన్నిధిలో ఉంటే రచయితగా కూడా మారిపోతానేమో, చెప్పలేను. కాని ప్రస్తుతానికి నేను చిత్రకారుణ్ణే. అందమైన ఈ భంగిమలో నిన్ను చూస్తుంటే చిత్రం గీయాలనిపిస్తోంది." కళ్లలో ఆనందం చిందులు వేస్తూంటే అన్నాడు రవి.

కళ కళకోసం అన్నది లోతైన మాటకాదు. వస్తుతః ప్రపంచంలో ఏదైనా మనిషికోసమే. విశ్వశ్రేయస్సుకన్న మానవుడైనా, మానవుని సాధనమైన కళ అయినా కాంక్షించవగిన ఉత్తమ లక్ష్యం లేదు. కళ కళకోసమే అన్నప్పుడు మనిషికి విలువ లేకుండా పోతున్నది.

---

"నన్నా! చిత్రం గీస్తారా!" ఆశ్చర్యపోయింది మాధవి.

"ఏం? ఎందుకు గీయ్యకూడదు? నిన్ను కట్నం లేకుండా వివాహం చేసుకున్నది ఎందుకనుకున్నావు?"

"మీరు కట్నం లేకుండా వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నారేమో అనుకున్నాను. మీ అభిప్రాయం అది కాదా?"

"కాదు, మధూ. నా ఉద్దేశ్యం ఏమిటో చెప్పనా?"

"చెప్పండి" అంది మాధవి. ఆమె కంఠస్వరంలో వినాలనే ఆసక్తిగాని, ఉత్సాహంగాని లేవు.

"నాకున్న కోరిక ఒక్కటే. చిత్రకారుడుగా నాలుగు కాలాలపాటు నిలవాలి. నేనింతవరకూ చాలా చిత్రాలు చిత్రించాను. నా చిత్రాలు చాలా బాగుంటాయి అని అనేకమంది మెచ్చుకున్నారు. కాని వాటిల్లో నాకు నచ్చింది, ఆత్మకి సంతృప్తి కలిగించింది ఏ ఒక్కటీ లేదు. 'మీకు నచ్చిన చిత్రం ఏది?' అని ఎవరైనా అడిగితే, ఏమీ సమాధానం చెప్పలేకపోతాను. ఎందుకో తెలుసా?"

తెలియదన్నట్లు తల ఊపింది మాధవి.

"నా చిత్రాల్లో నాకు ఏదీ నచ్చలేదు కనక. సృష్టిలో అందరికన్నా అందమైనది ఆడది. బ్రహ్మ సౌందర్యాన్ని అంతా స్త్రీలో ఇమిడ్చాడు. తన అందాన్ని సభ్యత పేరునా, రక్షణ పేరునా వస్త్రాల చాటున దాచుకుంటున్నది స్త్రీ. అందమైన ప్రతీ వస్తువు చిత్రకారుడికి ఉద్రేకాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తుంది. అందం లేనిదే చిత్రం లేనేలేదు.

"నేను చాలా రోజులనించి స్త్రీని నగ్నంగా చిత్రించడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాను. ఇంతవరకూ నా ప్రయత్నం నెరవేరలేదు. నా కోరిక తీరలేదు. నిన్ను చూస్తూంటే అంతరించిపోతున్న నా ఆశ, తిరిగి మొలకెత్త నారంభించింది. ఈ ఊరు మా స్నేహితుల్ని కలుసుకోవటానికి వచ్చినప్పుడు, ఎక్కడికో వెళ్ళుతున్న నిన్ను చూశాను. నీ అందం నన్ను ఆకర్షించింది. అందుకే కట్నం లేకుండా వివాహం చేసుకున్నాను. నేను ప్రదర్శించిన ఉదారత వెనక నా స్వార్థం దాగి ఉంది" అంటూ ఆమెను మంచం దగ్గిరికి నడిపించుకు వెళ్ళాడు రవి.

మౌనంగా మంచం చివర కూర్చుంది మాధవి. జడ నిండా కుట్టిన మల్లెమొగ్గలు విచ్చుకుంటూ పరిమళాల్ని విరజిమ్ముతున్నాయి. మాధవి మౌనంగా కూర్చోటం గమనించిన రవి అన్నాడు:

"ఏం మధూ, మాట్లాడవు? ఆలోచించుకుంటున్నావుకదూ?" అతని ప్రశ్నకు జవాబుగా ఆమె మెల్లిగా

వుజ్జిని జయలక్ష్మి

ఏడవసాగింది. మాధవి అలా చేస్తుందని అనుకోని రవి, ఆమె ప్రవర్తనకు విస్తుపోయాడు.

"ఎందుకు మధూ, అలా ఏడుస్తావు? నేను అన్నదాంట్లో తప్పేముందీ? నేను తప్పుగా ఏమీ అనలేదే! నీ చిత్రాన్ని గీస్తానన్నాను. నీ సౌందర్యాన్ని నీలోనే దాచుకోవద్దు. నలుగురికీ పంచిపెట్టు. వాళ్ళని ఆనందింపజెయ్యి. ఆనాడే నీ అందమూ, చిత్రకారుడుగా నా జీవితమూ ధన్యములవుతాయి.

"వద్దు, వద్దు. అలా చెయ్యకండి. నన్ను అవమానపరచకండి."

"ఇందులో అవమానం ఏముందీ?"

"అవమానం కాదూ, నగ్నంగా నిలబడటం? పైట కొద్దిగా భుజాలమీదనుండి జారితేనే సిగ్గుతో ముడుచుకుపోయే నేను, నగ్నంగా నిలబడలేను. దయ ఉంచి నన్నామాట అడక్కండి." ఆమె కంఠం గద్గదమైపోయింది.

ఆమె కంఠధ్వని అతనిలోని కోరిక ఏ మాత్రము కదల్చలేకపోయింది.

"భర్త ముందు నిలబడటానికి భార్యకు సిగ్గా?"

"అవును. సిగ్గే. భర్తే కావచ్చు. ఎవరైనా కావచ్చు. పురుషుడు పురుషుడే. ఏ స్త్రీ పురుషుడిముందు వివస్త్రఅయి నిలబడలేదు."

"పిచ్చి మధూ!" రవి నవ్వాడు. "అలా అని నీవు అనుకుంటున్నావు. ఎంతోమంది అమ్మాయిలు నాకు సహాయపడటానికి ముందుకు వచ్చారు. కానీ, వాళ్ళది నీలాంటి సహజసౌందర్యం కాదు. ప్రకృతిసిద్ధమైన అందం ఆకర్షించినట్లుగా, కృత్రిమ సౌందర్యం ఏ మాత్రము చిత్రకారుణ్ణి ఉత్తేజుణ్ణి చెయ్యలేదు. నీవు నచ్చావు. అందుకే నిన్ను వివాహం చేసుకున్నాను. నా కోరిక తీర్చవూ?"

"తీర్చను. . . తీర్చను. . .తీర్చను." మంచంమీది నుండి లేచిపోయింది మాధవి. అడుగులు తడబడుతూంటే తలుపు దగ్గిరికి వెళ్ళి ఆగిపోయింది. తలుపులు తెరుచుకుని వెళ్ళిపోదామనుకుంది. కానీ, వెళ్ళలేకపోయింది. అక్కడే కూలబడి ఏడవసాగింది.

మంచంమీదనుండి లేచాడు రవి. ఆమెకు దగ్గిరగా వచ్చి, మోకాళ్ళపై కూర్చుని, ఆమె కన్నీటిని తుడవసాగాడు.

"ఏడవకు మధూ, ఏడవకు. నా అందాలరాణి ఏడిస్తే, నే నెలా సహించాలను? ఛీ ఛీ. ఏడవకు. కళ్ళకు దిద్దిన కాటుక కరిగిపోయి కన్నీటిరూపంలో చెక్కిళ్ళపై ప్రవహిస్తూంటే, అందాలుచిందే నీ వదనం ఎలా వివర్ణమైపోయిందో చూడు."

అతని సాంత్వన వచనాలు ఆమెలోని బాధ పోగొట్టలేకపోగా, మరింత బాధ కలిగించాయి. 'అతని కోరికకు కారణమైన అందాన్ని నా కెందుకు ప్రసాదించావు భగవాన్?' అంటూ కనిపించని భగవంతుణ్ణి మనస్సులోనే అడిగింది. గట్టిగా నోరెత్తి అరిస్తేనే పలకని దేవుడు, ఆమె మూగప్రశ్నకు ఎలా బదులిస్తాడు?

"మధూ!"

ఈసారి అతని పిలుపు మొదటిసారి వినిపించినంత తియ్యగా వినిపించలేదామెకు. అయినా తప్పదు. సమాధానంగా ఏదో ఒకటి మాట్లాడాలి. అతడు భర్త! ఆమె భార్య! ఆ బంధాన్ని ఆమె తెంచుకోలేదు. మెల్లిగా అంది:



కాలం కార్చిన కన్నీరు
(ప్రాచీన శిల్పం)
(ప్రతికృతి—వి. ఆర్ (పేకిపెట్టిపాలెం)

**దగ్గు నివారణి.** తిరగపెట్టకుండా దగ్గును ఇప్పుడే నిర్మూలించండి. ఖరీదు రు. 157–15. ట్రయల్ రు. 12–13.

**చెవుడు.** పూర్తి కోర్సుద్వారా చెవుడు పూర్తిగా నయమగును. పూర్తి కోర్సు రు. 147–15. ట్రయల్ రు. 17–97 వ.పై.

**కంటిలోని పొర.** పక్వమైనా, కాకపోయినా, ఆపరేషన్ లేకుండా రు. 87–97 వ.పై.లకు తప్పక నయం చేయబడును.

జాబులు ఇంగ్లీషులో వ్రాయండి.

DR. SHERMAN, F.C.S.
181, R. N. Guha Road, Calcutta-28.

## డాక్టర్ వృత్తి చేయండి!



ఇంట్, కూర్చొని పోస్టల్ ట్యూషనుద్వారా ప్రభుత్వంచే పరిగణింపబడిన సంస్థనుంచి హోమియోపతిలో మూడు అత్యున్నతమైన డిగ్రీలు M.D.H., M.Sc. (Homoeo) Gold Medalist. పొందండి. పేరు, డబ్బు గడించండి. ఉచిత ప్రాస్పెక్టస్‌కొరకు వ్రాయండి.

INDIAN HOMOEOPATHIC COLLEGE.
(M.A.P.) P.B. 89, Jullundur City.

# సరికొత్త ప్రచురణలు

వేల్పూరి సుభద్రాదేవిగారి
**మంచుబొమ్మలు** రు 5—00
(ఆంధ్రప్రభ ఉగాది నవలా పోటీలో ప్రథమ బహుమతి పొందిన నవల)

వి. శ్యామలా రాణిగారి
**జీవ వాహిని** రు. 5—00
(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో సీరియల్‌గా వెలువడిన నవల)

ముప్పాళ రంగనాయకమ్మగారి
**గులాబి పూసింది** రు. 5—00
**పందిట్లో పెళ్ళవుతోంది** రు. 6—00

కోడూరి కౌసల్యాదేవిగారి
**సుప్రభాతం** రు 4—00
**శంకర్షణ** రు. 4—00

వి.పి. పద్ధతి లేదు. ముందుగా డబ్బుపంపిన వారికి పోస్టేజి ఉచితం.

ప్రతులకు:—

**విజయసారథి పబ్లికేషన్స్**
**విజయవాడ - 2**

# వల

"మీతో కలిసి బతకాలి నేను. నా ఆశలన్నీ మీతోనే. మీరు లేని నేను ఎలా ఉంటానో చెప్పలేను. మిమ్మల్ని ప్రేమించాలి నేను. ప్రేమించకుండా నేను బతకలేను. నేను మిమ్మల్ని ఎల్లప్పుడూ ప్రేమించాలని మీరు అనుకుంటే, నన్నా కోరిక కోరకండి."

"అలా అంటే నే నేం చెప్పను మధూ? నిన్ను చూడగానే నా ఆశయం నెరవేరుతుందని ఎంతో మురిసిపోయాను. నిజమైన సౌందర్యాన్ని నా చిత్రాలద్వారా కళాభిమానులకు అందిస్తే, నాకు కలిగే ఆనందం నీది కాదా?"

"ఆనందమా?" వెర్రిగా నవ్వింది మాధవి.

ఆమె నవ్వు చూసి కంగారు పడుతూ అన్నాడు రవి— "మధూ, అలా వెర్రిగా నవ్వకు. నిండుగా నవ్వు." కొన్ని క్షణాల తరవాత లేచి నిలబడి అటూ ఇటూ పచార్లు చేస్తూ అన్నాడు — "నువ్వీ గదిలో ఎన్ని ఆశలతో అడుగు పెట్టావో నాకు తెలుసు. నాకు చిత్రకళకన్నా ముఖ్యమైనది ఏదీ లేదు. ఒక్క రెండు నెలలు నిలబడితే చాలు. నగ్నంగా నాముందు. తరవాత. . ." అర్ధోక్తిలో ఆపేశాడు రవి.

"తరవాత?" ప్రశ్నించింది మాధవి.

"అందరి ఎదటా మా వివాహం జరిగిపోయింది. కాని, నేను చిత్రాలు పూర్తి చేసిన తరవాతే మనం దంపతులమవుతాము. అంతవరకూ నిన్ను ముట్టుకోను. నీ శరీరంపై చెయ్యి వెయ్యను. ఈలోపల జీవితం స్నేహితులా గడిపేదాం."

ముఖాన్ని మోకాళ్ళలో దాచుకుని బాగా మెల్లిగా అంది మాధవి — "ఆలోచించుకోనివ్వండి."

ఆ మాట వినగానే అంతవరకూ గంభీరంగా ఉన్న అతనిలో ఆనందం తొంగి చూసింది.

"అలాగే. ఆలోచించుకో. ఆలోచించుకుని నీ నిర్ణయాన్ని తెలియజెయ్యి. కానీ, నన్ను నిరాశ పరచకూడదు. తెలిసిందా?"

తల ఊపింది మాధవి. తప్పకుండా ఒప్పుకుని తీరుతుందనే ధీమాతో హాయిగా నిద్రపోయాడు రవి. గోడకి చేరబడి, నిరాశతో నిట్టూర్పులు విడుస్తున్న మనస్సును సముదాయించుకుని, కరిగిపోతున్న రాత్రిని కవిస్తున్న చంద్రుణి చూస్తూ ఉండిపోయింది మాధవి.

పగలు అంతా ఆ విషయమే ఆలోచిస్తూ గడిపింది. ఎంతో సరదాగా, తుళ్ళుతూ నవ్వుతూ ఉండవలసిన కూతురు దిగులుగా ఉండటం చూచి ఆశ్చర్యపోయింది సావిత్రమ్మ. "ఇదేం విచిత్రమో!" అంటూ బుగ్గలు నొక్కుకుంది.

ఆ రాత్రి గదిలో అడుగు పెడుతున్న మాధవిని ఆత్రంగా ప్రశ్నించాడు రవి — "మధూ, ఆలోచించుకున్నావా?"

"ఆలోచించాను."

"ఇష్టమేనా?"

"ఇష్టమే."

"మధూ!" రవి ముఖంలో వెయ్యి జ్యోత్స్న కాంతులు వెల్లివిరిశాయి. ఎంతో ఉత్సాహంతో ముందుకు అడుగువేసి, తన రెండు చేతులతో ఆమె ముఖాన్ని పైకి ఎత్తి, కవ్విస్తున్న ఆమె అధరాలను చుంబించ పోయాడు. అంతలోనే ఏదో అపరాధం చేసినట్టు వెనక్కి తగ్గాడు. బాధగా అన్నాడు — "క్షమించు మధూ, నా ఆనందంలో నేను చేసిన ప్రమాణాన్నే మరిచిపోయి, ఏదో చెయ్యబోయాను. క్షమించు."

"బలేవారే! క్షమించటం దేనికి? మీరు చెయ్యబోయింది, పెద్ద అపరాధమేమీ కాదు. కానీ, చేసిన ప్రమాణాన్ని మరిచిపోని మిమ్మల్ని ఎలా అభినందించాలో తెలియటం లేదు."

"సంతోషం, మధూ. మనం రేపే మా ఊరు వెళదాము. అక్కడ మన పనికి ఏ ఆటంకము రాదు" అంటూ ఆ ఊరి విశేషాలు, తన చిత్రాలు, తను అభిమానించే అమ్మాయిలు, తనను అభిమానించే అమ్మాయిలు, వాళ్ళు తనతో చర్చించే విషయాలు — ఎన్నెన్నో ఆమెకు వివరించి చెప్పాడు రవి. అన్నీ కుతూహలంగా వినింది మాధవి.

మరునాటి ఉదయమే ప్రయాణమయ్యారు ఇద్దరూ. స్టేషనుకు వెళ్ళడానికి రిక్షా ఎక్కుతున్న ఇద్దర్నీచూసి సంతోషంతో మురిసిపోయింది సావిత్రమ్మ.

సెకండుక్లాసు కంపార్టుమెంటులో కూర్చుని, అతనితోపాటు చేసిన మొదటి ప్రయాణపుటనుభూతుల్ని ఎంతో పదిలంగా దాచుకుంది అంతరంగంలో మాధవి.

ట్రెయిన్ దిగి టాక్సీలో కూర్చుని, ఎన్నడూ చూడని హైదరాబాదు నగర సౌందర్యాన్ని మొదటి సారిగా తిలకిస్తూ ఎంతో ఆనందించింది మాధవి.

రవి చెప్పిన ఎడ్రస్ ప్రకారం ఒక నీలంరంగు మేడ ముందు వచ్చి ఆగింది టాక్సీ. టాక్సీలోంచి దిగి మేడ వంక పరీక్షగా చూస్తున్న మాధవిని, "బాగుందా?" అంటూ ప్రశ్నించాడు రవి.

"బాగుంది." చిరునవ్వుతో జవాబిచ్చింది మాధవి.

ఇద్దరూ హాల్లో ప్రవేశించేసరికి, కుర్చీలో కూర్చుని ఎవరి కోసమో ఎదురు చూస్తున్నట్టున్న ఒక అమ్మాయి కనిపించింది. ఆ అమ్మాయికి ఇరవై సంవత్సరాల పైగానే ఉంటుంది వయస్సు. మెడలో ఒంటి పేట గొలుసు తప్ప ఆమెకు ఏమీ ఆభరణాలు లేవు. చేతులకు గాజులూ, చెవులకు దుద్దులూ ఏమీ లేవు. తెల్లటి ముఖంలో కాటుక దిద్దిన కళ్ళు కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నాయి. ముఖాన గుండ్రని కుంకుమబొట్టు ఉంది.

రవిని, మాధవిని చూడగానే లేచి నిలుచుంది. రవి వంక చిరునవ్వుతో చూసింది ఆ అమ్మాయి.

"హలో, శాంతా! ఎప్పుడు వచ్చావు?" శాంత భుజంమీద చెయ్యి వేస్తూ అడిగాడు రవి. అతని ప్రవర్తనకు విస్తుపోయింది మాధవి.

"ఇందాకానే వచ్చాను. ఒక అరగంట అవుతుంది వచ్చి. నాలుగైదు రోజులనించి వస్తూనే ఉన్నాను నీ కోసం. చెప్పకుండా, చెయ్యకుండా వెళ్ళిపోయావేమిటి? ఆఁ. సరే గానీ, ఈవిడెవరూ?" మాధవిని చూస్తూ అడిగింది శాంత.

"ఎవరో చెప్పుకోలేవూ?" చిలిపిగా ప్రశ్నించాడు రవి.

"చెప్పలేను. ఓడిపోయానని ఒప్పుకుంటున్నానులే.

చెప్పవూ?"

"నా భార్య."

రవి సమాధానం విని అలాగే నిలుచుండిపోయింది శాంత. తన చెవులనూ, కళ్లనూ నమ్మలేకపోయింది. "ఏమిటే, నిజంగానే?" అంది కనురెప్పలు ఆడిస్తూ.

"నిజమో, కాదో మాధవిని అడుగు." బూట్లు చప్పుడు చేసుకుంటూ లోపలికి వెళ్లిపోయాడు.

"మీ పేరు మాధవేనా?"

"అవును."

"మిమ్మల్ని రవి వివాహం చేసుకున్నాడా?"

"అవును. ఇందులో వింత ఏముంది?" మాధవి విస్మయం వ్యక్తం చేసింది తన ప్రశ్నలో.

"అవును. వింతే." శాంత శుష్కహాసం చేసింది. "రవికి చిత్రకళే జీవితము. చిత్రాలు అతనికి ప్రాణం. చిత్రాలు గియ్యకుండా అతడు బతకలేడు. వివాహం అతని చిత్రకళారాధనకు ఆటంకం కలిగిస్తుంది అంటాడు. 'వివాహబంధం అనేది కేవలం మనుషులను కొన్ని హద్దుల లోపల బంధించడానికి సంఘం ఏర్పరిచిన కృత్రిమబంధం' అనేది అతని ఉద్దేశ్యం. ఎవరినైనా ప్రేమిస్తానంటాడు కానీ, వివాహం అనే పదం ఎత్తవద్దంటాడు. 'మనిషిని బాహ్యసౌందర్యం ఆకర్షించవచ్చు కానీ, ఆ ఆకర్షణ ఎన్ని రోజులో నిలవదు' అంటూ పాట పాడతాడు. అటువంటి రవి మిమ్మల్ని వివాహం చేసుకున్నాడంటే నమ్మలేకపోతున్నాను. నెల రోజులుగా ఊళ్లో లేడు. ఎక్కడికో వెళ్లాడు అనుకుంటున్నాం మేమంతా. అదృష్టవంతులు మీరు!"

ఇంతలో లోపలినించి బట్టలు మార్చుకుని వచ్చిన రవి శాంతను నవ్వుతూ అడిగాడు: "ఏం, శాంతా! మాధవి ఎలా ఉంది?"

"బాగుంది."

"సరే. మీ స్నేహితులంతా ఏం చేస్తున్నారు?"

"ఏమీ చెయ్యకుండా జీవించలేరు మనుషులు. ఏదో ఒకటి చేస్తూండాలి. నవ్వటమో, ఏడవటమో, ఆడటమో, పాడటమో, మాటలాడటమో, ఇవన్నీ కాకపోతే, ఆలోచించటమో ఏదో చేస్తూంటా రిపాటికి."

"ఏమిటోయ్, మరీ తీవ్రంగా మాట్లాడేస్తున్నావు? నేను లేని నెల రోజుల్లో వేదాంతం ఏమన్నా ఒంటికి బాగా అంటించుకున్నావా?"

"ఇకనుండి అంటించుకోవాలేమో!" నీరసంగా నవ్వింది శాంత.

మాధవి మౌనంగా నిలబడి వాళ్లిద్దరి మాటలు వింటూంది. శాంత మాట్లాడుతూనే ఒకసారి బయటికి చూసింది. చీకటి తెరలు నలుదెసలా కమ్ముకుంటున్నాయి.

"చీకటి పడుతూంది, రవీ! నేను వెళతాను. వెళతానండీ, మాధవిగారూ!" అంటూ ఇద్దరి దగ్గిరా సెలవు తీసుకుని వెళ్లిపోయింది శాంత.

"అమ్మయ్య. ఇప్పటికి వదిలింది. ఇంకా ఎంతసేపు కూర్చుంటుందో అనుకున్నాను" అంటూ వెంకన్నని పిలిచి, "చీకటి పడింది. లైట్లు వెయ్యి" అన్నాడు రవి. వాడు అలాగేనంటూ వెళ్లాడు.

మేడమీదికి తీసుకువెళ్లి మాధవికి అన్నీ చూపించాడు రవి. అతని గదిలో గోడలనిండా ఆక్రమించిన అతని చిత్రాలను ఎంతోసేపు చూసింది. వాటిల్లో జీవకళ తొణికిసలాడుతున్నది. ఆ మూగబొమ్మలు మాటలాడటానికి పెదవులు విప్పుతున్నట్టు అనిపించి, అవి ఏం చేస్తాయో, ఏ కబుర్లు చెబుతాయో అని చాలా సేపు నిరీక్షించింది మాధవి. కాని, 'అవి మాటలాడలేవు' అన్న భావం ఆమెకు స్ఫురించగానే ఏదో తెలియని వెలితి ఆమె గుండెల్ని ఆవరించింది.

ఒక మంచి రోజున చిత్రాలు చిత్రించటం ప్రారంభించాడు రవి.

తొలిసారిగా అతని ముందు నగ్నంగా నిలబడటానికి మాధవి ఎంతో అవస్థ పడింది. నిటారుగా నిలబడలేకపోయింది. రెండు చేతులతో స్తనద్వయాన్ని కప్పుకుంది. కంగారుగా పక్కకి పరిగెత్తి అక్కడ పెట్టిన విప్పిన చీర ఒంటికి చుట్టబెట్టుకుంది.

"నేను నిలబడలేను, నేను నిలబడలేను." బొంగురుపోయిన కంఠంతో గట్టిగా అరిచింది మాధవి.

"మధూ!" లాలనగా పిలిచాడు రవి. ఆమె అవస్థ చూస్తూంటే చిత్రాలు వెయ్యటం మానెయ్యాలని పించింది. ఆమెను అలా బాధ పెట్టడంవల్ల తనకు లాభమేమిటి? కానీ . . . కానీ . . . తన ఆశయం, తన చిరకాల వాంఛ ఏమయిపోవాలి?

"నేను కళ్లు మూసుకుంటాను. చూడనులే. లేచి నిలబడవూ?" ప్రాధేయపూర్వకంగా ప్రార్థిస్తూ, రెండు చేతులతో కళ్లు మూసుకున్నాడు. నిజమేనని నమ్మి, లేచి నిలబడింది మాధవి. రవి కళ్లు తెరిచాడు.

"అదిగో, మీరు . . ." నిస్సహాయతతో ఏమీ అనలేకపోయింది మాధవి.

"నేను కళ్లు మూసుకుంటే ఎలా, మధూ? చిత్రాలు ఎవరు వేస్తారు? ఇదిగో, ఇలా నిలబడు" అంటూ ఆమె నిలబడవలసిన భంగిమ చూపించాడు.

అతను చెప్పినట్టే చేస్తూ, 'భగవాన్! నాకు సిగ్గు అనేది ఏమాత్రమయినా ఉంటే, దాన్ని ఈ క్షణానే అంతరింపచెయ్యి. నే నంతకు మించి మరేమీ కోరను' అంటూ భగవంతుణ్ణే తలుచుకుంది మాధవి.

అతను తన వంకే పరీక్షగా చూస్తూంటే, అతని చూపులు తన చర్మాన్ని చీల్చుకుని లోపలికి ప్రవేశించినట్లుంది ఆమెకు. ఆ చర్మం లోపల ఉండేది ఎముకల గూడు, మాంసపు ముద్ద అని సైన్సులో చదువుకున్న సంగతి గుర్తువచ్చి, ఆమె సిగ్గు పూర్తిగా మాయమయింది.

'తన భార్య నగ్నసౌందర్యాన్ని నలుగురికీ చూపించేందుకు అతను సిగ్గుపడకపోతే, తన కెందుకు సిగ్గు?' అన్న భావం ఆమెలో ఉదయించి, ఆమెను సంకోచం లేకుండా నిలబడేట్లు చేసింది.

తనను చూసికూడా చలించని అతని నిగ్రహశక్తికి మనస్సులోనే నివాళు లర్పించింది మాధవి.

మాధవి వైపు ఒకసారి చూశాడు రవి. ఆ రూపాన్ని మనస్సులో నిలుపుకున్నాడు. చిత్రం గీస్తున్నాడు. మళ్లీ ఏదో అనుమానం వచ్చి ఆమె వైపు తిరిగి చూస్తున్నాడు. ఆ క్షణంలో అతనికి మాధవి తన భార్య అన్న విషయమే గుర్తులేదు. ఒక యువతి! తన చిత్రకళకు ఉపయోగపడే ఒక వస్తువు! ఒక క్షణం ఆమె భంగిమవైపు, మరు క్షణంలోనే చిత్రంవైపు మళ్ళుతూంది అతని దృష్టి. అతని కుంచెకు ఇంక అడ్డు లేదు. బయటి ప్రపంచంలో ఏం జరుగుతూందో కూడా అతను గమనించటం లేదు.

రోజులు గడుస్తున్నాయి. అతను వేస్తున్న చిత్రాలు పూర్తి అవుతున్నాయి. అతను ఎన్ని భంగిమలలో చిత్రించాలనుకున్నాడో అన్నీ చిత్రిస్తున్నాడు.

'తను అద్దం ముందు నిలిచి తన ప్రతిబింబాన్ని చూసుకుంటున్నాను' అనుకునేది మాధవి, ఆ చిత్రాలను చూసి. అతని చిత్రకళా నైపుణ్యానికి ఆమె ముగ్ధురాలయింది.

ఒక రోజు తను చిత్రించిన చిత్రాలన్నింటిని ఒకసారి చూసుకున్నాడు రవి. అతని చిరకాలవాంఛకు ప్రతిరూపాలు అవి! కృతజ్ఞతాభావంతో మాధవి వైపు చూశాడు.

వెంకటగిరి జరీ చీరతో, అదే కలరు జాకెట్టుతో, వాలుజడతో, గుండ్రని కుంకుమ బొట్టుతో నిండుగా ముస్తాబయి ఉంది మాధవి. అతని కళ్లలో వెలుగుతున్న వెలుగును చూసింది ఆమె.

"మధూ, నా సంతోషాన్ని నీకు ఎలా తెలియ జెయ్యాలో తెలియటం లేదు." ఆనందంతో ఆమెకు దగ్గిరగా వస్తూ భుజంమీద మృదువుగా చేత్తో తట్టాడు.

"ఏమండీ?"

"ఎందుకు?"

> ఉన్నతుడైన మనిషి నిదానంగా మాట్లాడతాడు; శ్రద్ధతో వ్యవహరిస్తాడు.
>
> —కన్ఫ్యూషియస్

మాధవి తన కోరిక చెప్పలేకపోయింది అతనికి. ఇన్ని రోజులూ ఎక్కడికి పారిపోయిందో తెలియని సిగ్గు 'నే నున్నా' నంటూ మళ్లీ వచ్చి మాధవిని ఆక్రమించింది. కళ్లతోనే తన కోరిక వ్యక్తంచేసింది. ఆమె కోరికను గ్రహించిన రవి చిరునవ్వు నవ్వాడు.

"నీ కోరిక ఏమిటో అర్థమయింది. కానీ, నేను ఆలోచించుకోవాలి." ముఖాన్ని మరోవైపు తిప్పుకున్నాడు.

"ఆలోచనా?"

"అవును. ఆలోచించుకోవాలి. నేను ఏ విషయము ఇంకా నిర్ధారణ చేసుకోలేదు."

"దీనిలో ఆలోచించవలసింది ఏముంది?"

"నీకు లేకపోవచ్చు. నాకు ఉంది" అంటూ మేడమీది తన గదిలోనించి బయటికి వచ్చి మెట్లు దిగసాగాడు. అతని మాటలు అర్థంకాని మాధవి అయోమయంగా అతన్ని అనుసరించింది.

ఆఖరి మెట్టు దిగి హాల్లో ప్రవేశిస్తూ అన్నాడు రవి— "నీకు వెళ్లిపోవాలని ఉంటే మీ ఊరు వెళిపోవచ్చు. నేను ఏ విషయమూ, ఒక వారం రోజుల్లో తెలియజేస్తాను ఇప్పుడు ట్రెయిన్‌కూడా ఉన్నట్లుంది. టాక్సీని పిలవమంటావా? ఒరే వెంకన్నా!" అంటూ వెంకన్నను పిలిచాడు.

"ఏం, బాబుగారూ?" పరిగెత్తుకు వచ్చి చేతులు కట్టుకుని నిలబడ్డాడు వెంకన్న.

"అమ్మగారు వాళ్ల ఊరు వెళతారుట. టాక్సీ పిలూ."

"అప్పుడేనా? వచ్చి రెండు నెలలయిందో, లేదో?"

